సాక్షి ఒడిశా

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024





శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,07,605లు, బంగారం 640 మిల్లీగ్రాములు, వెండి 23 గ్రాములు 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



## బడ్జెట్ భరోసా..!

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తీసుకొచ్చిన మధ్యంతర రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించారు.

- IIలో



## సమరానికి సై..!

అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌కు రాష్ట్రం మరోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. రాష్ట్రంలో రెండు వేర్వేరు స్టేడియాల్లో ఈనెల 3 నుంచి ఈ టోర్నమెంట్ జరగనుంది.

- IIలో

## న్యూస్‌రీల్

### డాల్ఫిన్ల లెక్కింపు ప్రారంభం



చిలికా సరస్సులో సంచరిస్తున్న డాల్ఫిన్లు

బరంపురం: ఆసియాలోనే అతి పెద్దదైన చిలికా ఉప్పునీటి సరస్సులో డాల్ఫిన్ల లెక్కింపు గురువారం ప్రారంభమైంది. గంజాం జిల్లా అటవీ శాఖ, చిలికా అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సరస్సులోని డాల్ఫిన్ల లెక్కింపును ప్రతి ఏడాదిలాగే చేపట్టారు. సతపడా, కృష్ణప్రసాద్, నూవపడా, బోయికులా, బల్లగాం, టాంగి, బల్లుగాం రేంజ్‌ల పరిధిలో 100 మందికి పైగా వ్యక్తులు 18 బృందాలుగా విడిపోయి లెక్కింపు చేపట్టారు. వీరిలో అటవీ, పర్యావరణ, చిలికా అభివృద్ధి సంస్థ, వన్యప్రాణుల సంరక్షణ విభాగాల అధికారులు పాల్గొన్నట్లు చిలికా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ బి.ఆర్.దాస్ తెలియజేశారు.

### దాడిలో ఎలుగుబంటి మృతి



మృతి చెందిన ఎలుగుబంటి

బరంపురం: నగర శివారు లుచ్చాపడా గ్రామంలోకి గురువారం ఎలుగుబంటి చొరబడి భయాందోళనలు సృష్టించింది. పొలానికి వెళ్తున్న గ్రామస్తులపై దాడిచేసి గాయపరిచింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు కర్రలతో దాడిచేశారు. కర్రలతో కొట్టడంతో ఎలుగుబంటి మృతి చెందింది.

### శ్రీమందిరం రక్షణకు స్పెషల్ బెటాలియన్

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయ రక్షణ, భద్రత కోసం ప్రత్యేక భద్రతా బెటాలియన్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేక బెటాలియన్ ఏర్పాటుతో పూరీలో వివిధ ర్యాంకుల్లో 1,083 పోస్టులను భర్తీ చేయనున్నట్లు హోం శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. శ్రీమందిరం స్పెషల్ సెక్యూరిటీ బెటాలియన్ పూరీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో పనిచేస్తుంది.స్పెషల్ సెక్యూరిటీ బెటాలియన్ ఏర్పాటు చేయనుండడంతో ఆలయ భద్రత, భద్రత కోసం సింహద్వారం పోలీస్ ఠాణా అధీనంలో బాధ్యతలు నిర్వహించిన 139 ఏపీఆర్ పోస్టులు రద్దు చేసినట్లు ఉత్తర్వులు స్పష్టం చేశాయి. కొత్తగా సృష్టించబడిన పోస్టులు సంబంధిత రిక్రూట్‌మెంట్ నియమాలు మరియు ఓఆర్‌వీ చట్టంలోని నిబంధనల ద్వారా భర్తీ చేయబడతాయి. ప్రత్యేక భద్రతా బెటాలియన్ కోసం గ్రూప్–డీ సిబ్బంది వివిధ సేవలను అవుట్ సోర్సింగ్‌లో చేయడానికి సూత్రప్రాయంగా ఆమోదం ఇవ్వబడింది.

### ఐపీఎస్ రాధిక వీఆర్ఎస్



భువనేశ్వర్: సీనియర్ ఐపీఎస్ అధికారి బి.రాధిక ఉద్యోగ సేవల నుంచి స్వచ్ఛంద విరామం(వీఆర్ఎస్) తీసుకున్నారు. ఆమె అభ్యర్థన పరిశీలించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించినట్లు రాష్ట్ర హోం శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన బి.రాధిక, సెంట్రల్ డిప్యూటేషన్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమె ఒడిశాలోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎస్ఎఫ్ఎస్ఎల్) డైరెక్టర్‌గా సైతం అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం నుంచి స్వచ్ఛంద విరమణ పొందిన ఆమె తల్లిదండ్రుల సంరక్షణ కోసం మూడు నెలల తప్పనిసరి నోటీసు వ్యవధిని కూడా ప్రభుత్వం సడలించింది. జూలైలో ఆమె పదవీ విరమణ చేయాల్సి ఉంది.

**ఒడిశా కేడర్ తొలి మహిళా ఐపీఎస్**

డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) పదవికి పోటీ పడుతున్న ముగ్గురిలో ఒకరిగా ఈమె పేరు ప్రచారంలో ఉంది. సీనియర్ మహిళా ఐపీఎస్ అధికారి గతంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ)గా పనిచేస్తున్నప్పుడు ఒడిశా పోలీస్‌లో డైరెక్టర్ జనరల్ (డీజీ) స్థాయికి ప్రొఫార్మా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో ఊహాగానాల ప్రకారం రాధిక ఎంపికైతే ఒడిశాలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ)గా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా నిలిచేవారు. ఈమె మొదటి ఒడిశా కేడర్ మహిళా ఐపీఎస్ అధికారి.

# బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవం



పవిత్ర నదీజలం తీసుకొస్తున్న విద్యార్థినులు



పర్లాకిమిడి సమీపంలోని ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ ప్రాంగణంలో ఉన్నటువంటి శ్రీవిద్యా వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా గురువారం గుసాని సమితి మచ్చమర గ్రామంలోని మహేంద్రతనయ నుంచి సెంచూరియన్ విద్యార్థినులు 108 కలశాలతో పవిత్ర జలం తీసుకొచ్చారు. వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు, పద్మ దంపతులు స్వామివారికి కలశ స్నానం చేసి ప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం స్వామివారికి శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరువీధి ఉత్సవం, గరుడ వాహన సేవను రూసూరు గ్రామం వరకు నిర్వహించారు. ఉత్సవాలు ప్రధాన పూజారి అరవెల్లి శేఖరాచార్యులు, చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

– పర్లాకిమిడి



స్వామివారికి కలశ స్నానం చేయిస్తున్న దృశ్యం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆచార్య డి.ఎస్.రావు దంపతులు



సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

## ఆదివాసీల అభ్యున్నతే ధ్యేయం



గిరిజన ఉత్సవాల స్వాగత ద్వారం

రాయగడ: ఆదివాసీల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి బాసంతి హెంబ్రమ్ అన్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రత్యేక అభివృద్ధి మండలి(ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభమైన జిల్లా స్థాయి గిరిజనోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు సీఎం నవీన్ పట్నాయక్ ప్రత్యేక అభివృద్ధి మండలిని 23 జిల్లాల్లో ఏర్పాటు చేశారని తెలియజేశారు. గిరిజనుల భాష, సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సుస్థిర పాలనను గత రెండు దశాబ్దాలుగా అందిస్తున్న నవీన్ ప్రభుత్వం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ రాష్ట్ర శాఖ ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఎస్‌డీసీ వైస్ చైర్మన్ బనమాలి కద్రక తదితరులు హాజరయ్యారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి హెంబ్రమ్



ఆదివాసీల సాంప్రదాయ నృత్యం

## ఏటీఎం దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్ తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఏటీఎంలో నగదు దొంగలించిన దుండగులను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో ఎస్పీ రోహిత్ వర్మ వివరాలు వెల్లడించారు. గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మెషిన్‌ను ఓపెన్ చేసి నిందితులు రూ.19,50,100 ల నగదును బయటకు తీశారని తెలియజేశారు. అయితే గ్యాస్ కట్టర్లు వలన మంటలు రేగడంతో ఎమర్జెన్సీ సైరన్ మోగింది. దీంతో దొంగలు తాము తీసుకొచ్చిన కారులో నగదుతో చత్తీష్‌ఘడ్ వైపు వెళ్లారు. కానీ 30 కి.మీ వెళ్లాక కారు టైర్ పంక్చర్ అవ్వడంతో అడవిలోకి చొరబడినట్లు తెలియజేశారు. అప్పటికే జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. కాగా డాబుగాం అడవుల్లో గుర్తు తెలియని వ్యక్తుల కదలికలు ఉన్నాయని గిరిజనులు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసుల బలగాలు వారిని చుట్టుముట్టి కేవలం 8 గంటలలోపే అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారి నుంచి రూ.15,97,200తో పాటు ఒక తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హర్యానా రాష్ట్రానికి చెందిన షకిల్ ఖాన్, ఫైజల్ ఖాన్, షారుఖ్ ఖాన్, జహుల్ ఖాన్, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన నిఖిల్ కుమార్‌లుగా గుర్తించారు. వారిని కోర్టులో హాజరుపరిచి జైలుకి తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌డీపీవో కృష్ణచంద్ర, ఐఐసీ సంబిత్ కుమార్ బెహరాలు పాల్గొన్నారు.

### సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు



గౌరచంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాత్రికేయులు

భువనేశ్వర్: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఖుర్దా జిల్లా ప్రధాన సమాచారం, ప్రజా సంబంధాల అధికారి గౌరచంద్ర మహాపాత్రో ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక పాత్రికేయులు సాదరంగా వీడ్కోలు పలికారు. సుదీర్ఘంగా 37 ఏళ్లపాటు ఆయన ఈ విభాగంలో నిరవధికంగా సేవలు అందించారు. లోగడ కొద్ది కాలం గజపతి జిల్లా ప్రజా సంబంధాల అధికారిగా పని చేశారు. వీడ్కోలు సభలో పలువురు విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

### అయ్యో..!

- తల్లి మందలించిందని 10 ఏళ్ల బాలుడు ఆత్మహత్య



మృతుని ఇంటివద్ద గుమిగూడిన ప్రజలు

జయపురం: స్కూల్‌కు వెళ్లడం లేదని తల్లి మందలించడంతో 10 ఏళ్ల బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక పూర్ణఘడ్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివాసీ పండగ పుష్పుని జరుగుతుండడంతో పూర్ణఘడ్ గ్రామానికి చెందిన రామచంద్ర ముదిలి కుమారుడు కృష్ణ ముదిలి(10) కొద్ది రోజులుగా స్కూల్‌కి వెళ్లడం లేదు. అయితే బుధవారం తల్లి మందలించడంతో మరో విద్యార్థితో కలిసి స్కూల్‌కి బయల్దేరాడు. కానీ పాఠశాలకు వెళ్లకుండా ఆడుకోవడానికి వెళ్లాడు. ఈ విషయం తెలియడంతో తల్లి అతడిపై కోప్పడింది. దీంతో కృష్ణ స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అయితే సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెదికారు. అలాగే ఇంటికి కొద్ది దూరంలో పుష్పుని ఉత్సవాలు జరుగుతుండగా అక్కడ వెతికినా కనిపించలేదు. అయితే రామచంద్ర ఇంటికి సమీపంలో నిర్మాణంలో ఒక ఇల్లు ఉంది. అనుమానం వచ్చి ఆ ఇంటిలో చూడగా ఎవరూ ఊహించని దృశ్యం వారికి కనిపించింది. నిర్మాణంలో ఉన్న ఆ ఇంటి సీలింగ్‌కు తాడుతో ఉరి పోసుకొని కృష్ణ కనిపించాడు. ఈ విషయం జయపురం పట్టణ పోలీసులకు తెలియజేయగా, పోలీసులు వచ్చి మృతదేహాన్ని కొందికి దింపి పోస్టుమార్టంకి తరలించారు. బాలుడి మరణంతో గ్రామంలో విషాదం అలముకుంది. చిన్న విషయానికి 10 ఏళ్ల బాలుడు ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశమైంది.

## యాత్రికుల బస్సును ఢీకొన్న లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు



ప్రమాదానికి కారణమైన లారీ

రాయగడ: పూరీ జిల్లా పిపిలి నుంచి యాత్రికులతో వస్తున్న ఒక ప్రైవేట్ బస్సును లారీ ఢీకొంది. స్థానిక జగన్నాథ మందిరం సమీపంలో గురువారం తెల్లవారున జరిగిన ఈ ప్రమాదంలో యాత్రికులు సురక్షితంగా బయటపడగా, బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. పిపిలి నుంచి 42 మంది యాత్రికులతో బస్సు రాయగడకు చేరుకుంది. ఈ క్రమంలో మజ్జిగౌరి మందిరం దర్శనానికి వెళ్తున్న సమయంలో ఆంధ్ర వైపు నుంచి వస్తున్న లారీ అదుపుతప్పి బస్సును ఢీకొంది. బస్సు ముందు భాగం దెబ్బతినగా అద్దాలు పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు లారీ, బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

## విద్యుత్ చార్జీల్లో పెంపు లేదు

- ప్రకటించిన గ్రిడ్కో సంస్థ

భువనేశ్వర్: రిటైల్ పవర్ టారిఫ్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఎటువంటి పెంపుదల లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను అందిస్తామని గ్రిడ్కో హామీ పూర్వకంగా ప్రకటించింది. గ్రిడ్కో వార్షిక ఆదాయ అవసరాలు (ఏఆర్ఆర్) మరియు వ్యాపార ప్రణాళిక (బీఎస్‌పీ) అప్లికేషన్‌పై ఒడిశా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఓఈఆర్‌సి) గురువారం నిర్వహించిన ప్రజాభియోగాల సమావేశం తర్వాత ప్రకటన చేసింది. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి తన వ్యూహాన్ని గ్రిడ్కో వివరించింది. 37,457 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ అవసరాన్ని అంచనా వేసింది. దీనికి వ్యతిరేకంగా దీర్ఘకాలిక విద్యుత్ ఒప్పందాల నుంచి 39,652 యూనిట్ల లభ్యతను నిర్ధారించింది. రిజర్వ్ 2,196 ఎంయూ (-6%). దాని ఖచ్చితమైన ప్రణాళికలో భాగంగా, గ్రిడ్కో క్యాప్టివ్ పవర్ ప్లాంట్లు, స్వల్పకాలిక, మధ్యకాలిక ఒప్పందాల నుంచి విద్యుత్ సరఫరాలో ఏవైనా అవసరాలను తీర్చడానికి ఏర్పాట్లను వివరించింది. అంతేకాకుండా, రాష్ట్రంలో సుస్థిరతను పెంపొందించడానికి పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని కొనసాగించడాన్ని ఇది హైలైట్ చేసింది.

**సవాళ్లు ఉన్నప్పటికీ...**

విద్యుత్ వ్యయంలో సవాళ్లు ఉన్నప్పటికీ రిటైల్ టారిఫ్‌లను పెంచాల్సిన అవసరం లేకుండా 2024–25 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన విద్యుత్ ఖర్చులను నిర్వహించగల సామర్థ్యంపై విశ్వాసం వ్యక్తం చేసింది. డిస్కమ్‌ల వద్ద లభించే నియంత్రణ మిగులు రుణ విమోచన, పెరిగిన డిమాండ్ కారణంగా ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా ఏదైనా పెరుగుతున్న ఖర్చులను గ్రహించవచ్చని పేర్కొన్నారు. గ్రిడ్కో రాష్ట్ర ప్రజలకు నమ్మకమైన, స్థిరమైన విద్యుత్ సరఫరాను అందించాలనే ఉద్దేశంతో ఉందని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో 10 మందికి గాయాలు

జయపురం:

సదర్ పోలీసుస్టేషన్ పరిధి 26వ నంబర్ జాతీయ రహదారి అంబాగుడ సమీపంలో ఒక ఆటోను వ్యాన్ ఢీకొన్న ఘటనలో 10 మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కొరాపుట్ సునాబెడకు చెందిన ధనలక్ష్మీ స్వయం సహాయక సంఘం సభ్యులు రెండు ఆటోల్లో, జయపురం సమితి అంబాగుడ సమీపంలోని బీజే–2 గ్రామానికి చెందిన సపన్ దాస్ కుమార్తె వివాహ విందుకు ఆహారం సరఫరా చేసేందుకు బుధవారం సాయంత్రం బయల్దేరారు. వాటిలో ఒక ఆటోను బీజే–2 గ్రామ సమీపంలోని టర్నింగ్ వద్ద బొరిగుమ్మ నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే అంబాగుడ పోలీసులు, జయపురం సదర్ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని అంబులెన్స్‌లకు సమాచారం అందించారు. అంబులెన్స్‌లు వచ్చిన వెంటనే క్షతగాత్రులను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వారిలో 5 మందిని మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల మెడికల్‌కు తరలించారు. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు.



సంఘటన స్థలంలో గుమిగూడిన ప్రజలు

## క్లుప్తంగా

### పరిక్రమ ప్రాజెక్టులో నిధులు దుర్వినియోగం

- ఎమ్మెల్యే కోడూరు ఆరోపణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు

**పర్లాకిమిడి:** రాష్ట్ర ప్రభుత్వం పూరీ పుణ్యక్షేత్ర పరిక్రమ ప్రాజెక్టులో నిధులు దుర్వినియోగం చేసిందని బీజేపీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిధుల వినియోగంపై సీఎం నవీన్ పట్నాయక్ త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయోధ్య భవ్య రామ మందిరం నిర్మాణానికి రూ.3,500 కోట్లు సమకూర్చగా, రూ.1,800 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని, కానీ పూరీ పరిక్రమ కారిడార్‌కు రూ.4,200 కోట్లు ఎలా ఖర్చు చేశారని ప్రశ్నించారు. ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమిళనాడు నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారి మన రాష్ట్రంలో ఒక ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తూ, ఇక్కడి నిధులు ప్రక్క రాష్ట్రానికి తరలిస్తున్నారని, ఇది మన రాష్ట్ర దౌర్భాగ్యమని మండిపడ్డారు.

### జాతీయ తైక్వాండో పోటీలకు రిఫరీగా గౌతమ్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకూ జరగనున్న 37వ జాతీయ సబ్ జూనియర్ కొర్గీ, 12వ జాతీయ సబ్ జూనియర్ పూమ్ సే తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకి నేషనల్ రిఫరీగా శ్రీకాకుళానికి చెందిన మజ్జి గౌతమ్ నియమితులయ్యారు. దీంతో గౌతమ్‌ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అభినందించారు. భవిష్యత్ లో కూడా మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని, జిల్లాకి చెందిన క్రీడాకారులు రాణించేలా శిక్షణలు అందించాలని ఆయన కోరారు.

### 4న రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

**కంచిలి:** మండలంలోని గోకర్ణపురం గ్రామంలో 'మీతో' టీం వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 4వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నామని నిర్వాహకులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ క్విజ్ పోటీలు ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి తెలుగు, సైన్స్, సోషల్, జీకే అండ్ కరెంట్ అఫైర్స్, ఫొటో క్విజ్, రాపిడ్ ఫైర్ రౌండ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనడానికి ఎలాంటి వయోపరిమితి లేదని, రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ నంబర్ 9493577544ను సంప్రదించాలని సూచించారు.

### లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


డ్రైవర్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది

**టెక్కలి రూరల్:** స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీపంలో గల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. హరియాణాకు చెందిన లారీ డ్రైవర్ లుక్‌మాన్ ఖాన్ పలాస నుంచి టెక్కలి వైపు వస్తూ స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీపంలోకి వచ్చే సరికి తన లారీకి ముందువెళ్తున్న లారీని అతి వేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ వైపు ఉన్న క్యాబిన్ పూర్తిగా లోపలకు పోవడంతో అందులో డ్రైవర్ ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో డ్రైవర్‌ను బయటకు తీశారు. అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

# బడ్జెట్ భరోసా..!

- రాష్ట్ర రైల్వేకు నిధుల వెల్లువ
- మధ్యంతర బడ్జెట్‌లో రూ.10,536 కోట్ల కేటాయింపు
- గతం కంటే రూ.524 కోట్లు అధికం: రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్


ఖుర్దారోడ్ మండల కార్యాలయంలో పాల్గొన్న డీఆర్ఎం హెచ్.ఎస్.బాజ్వా తదితరులు

**భువనేశ్వర్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తీసుకొచ్చిన మధ్యంతర రైల్వే బడ్జెటులో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించారు. గతం కంటే అత్యధికంగా నిధులు కేటాయించినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రాష్ట్రానికి ఏటా నిధుల కేటాయింపు గణనీయంగా పెరుగుతోందన్నారు. ఈ మేరకు గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర కేటాయింపులు వివరించారు.

**ఆదాయంలో సగం నిధుల కేటాయింపు**

2024–25 సంవత్సరానికి సంబంధించిన మధ్యంతర కేంద్ర బడ్జెట్‌లో సరుకు రవాణా ఆదాయంలో సగం మొత్తం నిధులు రాష్ట్రానికి కేటాయించడం విశేషం. రాష్ట్రంలో రైల్వే రంగాలకు సమగ్రంగా రూ.10,536 కోట్ల నిధులు కేటాయించారు. పార్లమెంట్‌లో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రానికి గతేడాది చేసిన కేటాయింపుల కంటే రూ.524 కోట్లు అధికంగా ఈ ఏడాది కేటాయించినట్లు విశ్లేషించారు. ఈ మొత్తం తూర్పు కోస్తా రైల్వే (ఈకోర్) సరుకు రవాణా ఆదాయంలో 50 శాతంగా పేర్కొన్నారు. దశాబ్దం క్రితం కేటాయించిన సగటు నిధుల కంటే ఇది 1,157 శాతం అధికమని వెల్లడించారు.

**ఏటా పెరుగుతున్న కేటాయింపులు**

గత 3 ఏళ్లుగా రాష్ట్రంలో రైల్వేల కోసం సగటున ఏడాదికి రూ.10 వేల కోట్లు కేటాయింపులు చేస్తున్నట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2023–24 రైల్వే బడ్జెట్‌లో ఒడిశాకు రూ.10,012 కోట్లు కేటాయించగా, 2022–23లో రూ.9,734 కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు.

**త్వరలో వందే మెట్రో రైలు**

రానున్న రోజుల్లో రాష్ట్రంలో కొత్త రైల్వే ప్రాజెక్టులకు రూ.52 వేల కోట్ల నిధులు వెచ్చించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ జాబితాలో వందే మెట్రో రైలు సేవలు చోటు చేసుకోవడం విశేషం. రైల్వే బడ్జెటులో ఒడిశాకు పుష్కలంగా నిధులు కేటాయిరపు కొనసాగుతోంది. రాష్ట్రంలో ఇప్పటికే 100 శాతం రైల్వేల విద్యుదీకరణ సాధ్యమైందన్నారు. అలాగే ప్రస్తుతం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 58 రైల్వేస్టేషన్ల అభివృద్ధికి పనులు శరవేగంగా సాగుతున్నాయి. స్థానిక హస్తకళలు, చేనేత మరియు ఇతర స్థానిక ఉత్పత్తుల విక్రయాల కోసం ఒడిశాలో 42 రైల్వే స్టేషన్లలో వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్స్ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

**జంట నగరాలకు మెట్రో రైలు**

కటక్, భువనేశ్వర్, పూరీ ప్రాంతాలకు వందే మెట్రో రైలును నడుపుతారని మంత్రి తెలిపారు. తదుపరి రౌర్కెలా – సంబల్‌పూర్ – ఝార్సుగుడ లేదా తాల్చేర్ – అంగుల్ ప్రాంతాల్లో ఈ సదుపాయం కోసం పరిశీలిస్తారన్నారు. ఒడిశాలో కొత్త ప్రాజెక్టుల కోసం భారీ పెట్టుబడులు బడ్జెటులో చోటుచేసుకున్నట్లు వివరించారు. భువనేశ్వర్, పూరీ, కటక్ రైల్వే స్టేషన్లలో సంఘటిత స్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఖుర్దా – బొలంగీర్, తాల్చేర్ – బిమలాగఢ్ మొదలైన వివిధ ప్రాజెక్టుల పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఖుర్దారోడ్ మండల ప్రధాన కార్యాలయంలో డివిజనల్ రైల్వే మేనేజర్ హెచ్.ఎస్.బాజ్వా, అదనపు మండల రైల్వే మేనేజర్ (ఓపీ) కల్యాణ్ పట్నాయక్, అదనపు మండల రైల్వే మేనేజర్ (ఇన్‌ఫ్రా) శుభ్ర జ్యోతి మండల్, సీనియర్ మండల ఇంజినీర్ (సమన్వయం) ఆర్.పి.యాదవ్, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ కె.సందీప్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అమితేష్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

# ఏడీజీపీగా దయాళ్ గంగ్వార్

**భువనేశ్వర్:** సీనియర్ ఐపీఎస్ అధికారి దయాళ్ గంగ్వార్ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీపీ)గా నియమితులయ్యారు. రాష్ట్ర హోం శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఐపీఎస్ అధికారుల స్థాయిలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. గంగ్వార్ ప్రస్తుతం రైల్వే, కోస్టల్ సెక్యూరిటీ ఏడీజీపీగా పనిచేస్తున్నారు. డీజీపీ (ఆధునీకరణ)గా పని చేస్తున్న 1998 బ్యాచ్ అధికారి రాజేష్ కుమార్ రైల్వే, కోస్టల్ సెక్యూరిటీ ఏడీజీపీగా బదిలీ అయ్యారు. ఈ హోదాతో స్టేటు ఫోరెన్సిక్ సైన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎస్ఎల్) డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని ఉత్తర్వులు పేర్కొన్నాయి. డీఐజీ ఆఫ్ పోలీసుగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2007 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అవినాష్ కుమార్‌ని బదిలీ చేసి, భువనేశ్వర్ – కటక్ జంట నగరాల అదనపు పోలీస్ కమిషనర్‌గా నియమించారు. 2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత భువనేశ్వర్ – కటక్ కమిషనరేట్ ఆఫ్ పోలీసు అదనపు కమిషనర్ బ్రిజేష్ కుమార్ రే డీఐజీ ఆఫ్ పోలీస్ (ఇంటెలిజెన్స్ – సెక్యూరిటీ వింగ్) ఇన్‌చార్జిగా బదిలీ అయ్యారు.

**ఓపీఎస్ కేడర్‌లో పునర్వ్యవస్థీకరణ**

ఒడిశా పోలీస్ సర్వీస్ (ఓపీఎస్) కేడర్‌లో భారీ పునర్వ్యవస్థీకరణను అమలు చేస్తూ తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒడిశా పోలీసు వర్గంలో 100 మందికి పైగా అధికారులను బదిలీ చేశారు. వీరందరికీ కొత్త పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కటక్ ఒడిశా పోలీసు రాష్ట్ర ప్రధాన కార్యాలయం అదనపు ఎస్పీ హోదాలో బదిలీలు, పోస్టింగ్‌ల కోసం ఉత్తర్వులు విడుదల చేసింది. బుధవారం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం అదనపు ఎస్పీ ర్యాంకులో 5 మంది అధికారులను బదిలీ చేశారు.

# భల్లూకాల బీభత్సం

- ఉద్దానంలో మరోసారి ఎలుగు దాడి
- వేర్వేరు చోట్ల నలుగురికి గాయాలు
- ఆందోళనలో జీడి రైతులు


నారాయణమ్మకు చికిత్స అందిస్తున్న వైద్యులు

**వజ్రపుకొత్తూరు రూరల్:** ఉద్దానం మరోమారు ఉలిక్కిపడింది. గతంలో జరిగిన ఎలుగుబంటి దాడుల భయం ఇంక వీడకముందే గురువారం మళ్లీ మరోసారి భల్లూకాలు బీభత్సం సృష్టించాయి. మండలంలోని చీపురపల్లి పంచాయతీ పరిధిలో గల ఎం.గడూరు, డెప్పూరు జీడి తోటల్లో గురువారం జరిగిన ఎలుగు దాడి సంఘటనలో నలుగురు గాయపడ్డారు. ఎం.గడూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు పిన్నాసి కుమారస్వామి ఉదయం సముద్ర వేట చేస్తూ ఇంటికి వస్తున్న సమయంలో ఎలుగు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అలాగే డెప్పూరు గ్రామానికి చెందిన లైశెట్టి నారాయణమ్మ పరిసర జీడి తోటకు రేగిపండ్లు సేకరించేందుకు వెళ్తున్న సమయంలో వెనుక నుంచి ఒక్కసారిగా రెండు ఎలుగులు దాడి చేయడంతో ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. అలాగే అదే గ్రామానికి చెందిన జీడి రైతులు సీలం తాతారావు, పి.ఉర్మిల జీడి తోటలకు రక్షణ కంచె ఏర్పాటు చేస్తున్న తరుణంలో ఎలుగులు దాడి చేశాయి. బాధితుల చేతికి రక్షణ గ్లౌజులు, ఆయుధాలు ఉండటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఎలుగు దాడుల్లో తీవ్రంగా గాయపడిన పిన్నాసి కుమారస్వామి, లైశెట్టి నారాయణమ్మలను స్థానికులు ప్రైవేట్ వాహనంలో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు.

**కాపాడిన పెంపుడు కుక్కలు**

ఎలుగు దాడి చేస్తున్న సమయంలో స్థానికుడు పి.చలపతి రావు తన పెంపుడు కుక్కలతో గడూరు రావడంతో ఎలుగును గమనించిన కుక్కలు ఎలుగు వైపు అరుస్తూ దూసుకెళ్లాయి. దీంతో ఎలుగు అక్కడి నుంచి పారిపోయింది. దీంతో బాధితుడు కుమారస్వామి ప్రాణాపాయం నుండి బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

**వణుకుతున్న ఉద్దానం**

ఉద్దానం, తీర ప్రాంతంలో ఎలుగులు పగలు, రాత్రి అని తేడా లేకుండా సంచరిస్తున్నాయి. తారస పడిన ప్రజలపై దాడులు చేస్తూ ప్రాణాలను తీస్తున్నాయి. రెండేళ్ల క్రితం కిడిసింగి గ్రామానికి చెందిన జీడి రైతు ఎలుగు దాడిలో మృత్యువాత పడ్డారు. అలాగే వజ్రపుకొత్తూరు గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో అందులో ఇద్దరు మరణించారు. ఈ సంఘటనలు ప్రజలు మరువక ముందే నేడు మరో ఎలుగు దాడి సంఘటన ఉద్దానంలో చోటు చేసుకోవడంతో జీడి రైతులు ప్రాణ భయంతో వణికిపోతున్నారు. వారి ప్రధాన జీవనాధారమైన జీడి పంట పూత, పిందె దశలో ఉండడంతో తోటలకు వెళ్లక తప్పని పరిస్థితి. అయితే తమ కళ్ల ముందే ఎలుగులు దాడులు చేస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఎలుగులను నియంత్రించాలని అటవీ శాఖాధికారులను కోరుతున్నారు. ఈ విషయంపై కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజర్ మురళీకృష్ణ నాయుడుని సంప్రదించగా ఎలుగులు కవ్వింపు చర్యలకు పాల్పడరాదని, అలాగే జీడి రైతులు వారితో పాటు రక్షణ కోసం ఆయుధాలను తీసుకువెళ్లాలని, ఒంటరిగా తోటలకు వెళ్లరాదని సూచించారు. ఎలుగుల సంచార సమాచారాన్ని తమకు తెలియజేయాలని అన్నారు.

### సమాచార హక్కుపై శిక్షణ శిబిరం


సమావేశంలో పాల్గొన్న అధికారులు

**పర్లాకిమిడి:** ఒడిశా ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టంపై జిల్లా పరిషత్ పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ శిబిరం గురువారం నిర్వహించారు. ప్రదీప్త గురుమయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 81 మంది ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం–2005 సెక్షన్ –4పై పలు నిబంధనలు, ఫస్ట్ అప్పీల్‌పై వివరించారు. సమావేశంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డా.ప్రదీప్ కుమార్ పాత్రో, డాక్టర్ మహ్మద్ అలీ, డీఎస్ఎస్‌వో సంతోష్ కుమార్ నాయక్, జిల్లా సంక్షేమశాఖ అధికారి మమతారాణి పరిడా, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా కుమారీ మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎలక్ట్రికల్ స్కూటీ దహనం

**కంచిలి:** కేసరపడ గ్రామానికి చెందిన కప్పల సోమయ్యకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటీ దహనం చేసినట్లు గురువారం ఫిర్యాదు అందినట్లు స్థానిక ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. ఈ స్కూటీతోపాటు గొరిబిడ్డి మన్మథరావుకు చెందిన కేబుల్ వైర్లను కత్తిరించినట్లు తెలిపారు. ఈ స్కూటీని గ్రామ సమీపంలోగల పెసర పొలంలో దహనం చేసినట్లు గుర్తించారు. అదే గ్రామానికి చెందిన ఇప్పిలి సురేష్ కు మార్‌ను అనుమానితుడిగా పేర్కొంటూ.. పాతకక్ష ల మూలంగా నష్టపరిచినట్లు బాధితుడు సోమయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

### కొట్లాటపై కేసు నమోదు

**మెళియాపుట్టి:** మండలంలోని వసుంధర గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన కొట్లాటలో ఎనిమిది మంది కలిసి జానం లక్ష్మీపతి అనే వ్యక్తిని గాయపరిచారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెళియాపుట్టి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, పాతపట్నం సీఐ నల్లి సాయి వసుంధర గ్రామాన్ని సందర్శించి కొట్లాటకు సంబంధించి ద ర్యాప్తు నిర్వహించారు. ఎస్ఐ రాజేష్ మాట్లాడు తూ వసుంధర గ్రామంలో గ్రామదేవత ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా మాటామాటా పెరిగి గ్రా మానికి చెందిన సలాన వినోద్, బాడాన కృష్ణారా వు, సలాన మహేష్, సలాన పృథ్వీ, బొచ్చు శరత్, తులసి తేజేశ్వరరావు, బాడాన రాజేష్, సలాన వెంకటరావు కలిసి దాడికి దిగినట్లు తెలిపారు.

# సమరానికి సై..!



- రేపటి నుంచి ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్
- టికెట్ల అమ్మకాలు ప్రారంభం
- సాధనలో తలమునకలైన జట్లు

**భువనేశ్వర్:** అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌కు రాష్ట్రం మరోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. రాష్ట్రంలో రెండు వేర్వేరు స్టేడియాల్లో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈనెల 3 నుంచి 25 వరకు భువనేశ్వర్ కళింగ స్టేడియం, రౌర్కెలా బిర్సా ముండా స్టేడియాలు ఈ పోటీలకు సిద్ధమయ్యాయి. దీనిలో భాగంగా భారత పురుషులు, మహిళల హాకీ జట్లు సాధనలో తలమునకలై ఉన్నాయి. ఈ మ్యాచ్‌ల కోసం టికెట్ల విక్రయం ప్రారంభమైంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో టికెట్లు లభిస్తున్నాయి. మ్యాచ్‌లు సజావుగా సాగేందుకు రాష్ట్ర క్రీడలు, యువజన సేవల విభాగం, ఇతర ప్రభుత్వ విభాగాలు, హాకీ ఇండియా సమన్వయంతో కృషి చేస్తున్నాయి.

**పోటీకి అంతర్జాతీయ జట్లు**

చైనా, అమెరికా, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియాకు చెందిన మహిళా జట్లు బుధవారం భువనేశ్వర్ చేరుకున్నాయి. సవిత నేతృత్వంలో భారత మహిళల హాకీ జట్టు పోటీకి అన్నివిధాల సిద్ధమైంది. ఈనెల 3 నుంచి 9 వరకు భువనేశ్వర్‌లోని కళింగ హాకీ స్టేడియంలో అమెరికా, నెదర్లాండ్స్, చైనా, ఆస్ట్రేలియాతో భారత్ మహిళల జట్టు తలపడుతుంది. తదుపరి ఈనెల 12 నుంచి 18 మధ్య రౌర్కెలా బిర్సా ముండా హాకీ స్టేడియంలో జరిగే మ్యాచ్‌ల కోసం భారత్ మహిళల జట్టు బయల్దేరుతుంది. భారత పురుషుల జట్టు నెదర్లాండ్స్, స్పెయిన్, ఆస్ట్రేలియా, ఐర్లాండ్‌లతో స్థానిక కళింగ స్టేడియంలో ఈనెల 10 నుండి 16 వరకు తలపడుతుంది. ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు తదుపరి జరిగే మ్యాచ్‌ల్లో రౌర్కెలా బిర్సా ముండా స్టేడియంలో భారత్ పురుషుల జట్టు తలపడుతుంది. త్వరలో ప్యారిస్ – 2024 ఒలింపిక్స్ పోటీలు జరగనున్న నేపథ్యంలో పురుషుల జట్టుకు ఈ టోర్నీ అత్యంత కీలకం కానుందని రాష్ట్ర క్రీడలు, యువజన సేవల విభాగం కార్యదర్శి వినీల్ కృష్ణ తెలిపారు.

**అందుబాటులో టికెట్లు**

ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ 2023–24 టోర్నమెంట్ టికెట్ల విక్రయం ప్రారంభం అయింది. ఈ టికెట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. టిక్కెట్ల ఆన్‌లైన్ బుకింగ్ కోసం www.ticketgenie.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. అలాగే ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భువనేశ్వర్ కళింగ హాకీ స్టేడియం 9వ నంబర్ గేటు దగ్గర కౌంటరులో కొనుగోలు చేయవచ్చు.



# ఆస్పత్రి సందర్శన


ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తివాసన్

**జయపురం:** కొరాపుట్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వి.కీర్తి వాసన్ జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సేవలు, ఆహారం తదితర విషయాలపై రోగులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్యంకు అధిక ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సూచించారు. ఆహార కేంద్రంలో అవసరమైతే మరో వంద ప్లేట్ల ఆహారం రోగులకు సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, సీడీఎంవో డాక్టర్ కనూచరణ పాత్రో, జిల్లా పబ్లిక్ హెల్త్ అధికారి డా.అరుణ కుమార్ పాడీ, డాక్టర్ దిలీప్ కుమార్ బిశ్వాల్, ఆర్అండ్‌బీ ఇంజినీర్ క్షీరధర ఖండపాణి, ఆస్పత్రి మేనేజర్ రూపసి మధుమిత నాయక్ తదితరులు ఉన్నారు.

# మహేంద్రతనయ నదిపై కాజ్‌వే నిర్మాణం


ప్రభుత్వ అనుమతి పత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

**ఎల్.ఎన్.పేట:** పాతపట్నం మండలంలోని గంగువాడ నుంచి గోపాలపురం వెళ్లేందుకు మహేంద్రతనయ నదిపై కాజ్‌వే రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.40 లక్షల నిధులను విడుదల చేసినట్లు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం తెలిపారు. మహేంద్రతనయ నది దాటి వెళ్లేందుకు ఆయా గ్రామాల ప్రజలతో పాటు పొలం పనులకు వెళ్లేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతుండేవారు. సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకుని వచ్చారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌కు ఈ సమస్య గురించి వివరించానని, దానికి స్పందించిన సీఎం జగనన్న రూ.40 లక్షల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి పరిపాలన, ఆర్థిక పరమైన అనుమతి లభించటంతో ప్రస్తుతం టెండర్ల దశకు చేరుకుందన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు చేపడతారని తెలిపారు. డీఎంఎఫ్ విభా గం నుంచి విడుదలైన నిధులతో శ్రీకాకుళం పీఐ యూ విభాగం ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ పనులు చేపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.శ్యామసుందరరావు, పాతపట్నం ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునరావు, మెళియాపుట్టి పీఏసీఎస్ అధ్యక్షుడు ఊర్లాన బాలరాజు పాల్గొన్నారు.

# వల.. కళకళ

**వజ్రపుకొత్తూరు:** మత్స్యకారుల కష్టం ఫలించింది. ఈ ఏడాది అరకొరగానే లభించిన కోనేం, ట్యూనా చేపలు గురువారం మంచినీళ్లపేట మత్స్యకారులకు పెద్ద మొత్తంలో చిక్కాయి. మార్కెట్‌లో ప్రస్తుతం కోనేం ధర అనుకూలంగా ఉండడంతో మత్స్యకారుల్లో ఆనందం రెట్టింపైంది. గురువారం వేకువ జామున ఏడు సంప్రదాయ బోట్లతో వేటకు వెళ్లిన స్థానిక మత్స్యకారులు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వేట ముగించుకుని తీరానికి చేరారు. ప్రతి బోటుకు దాదాపు 80 నుంచి 150 కిలోల వరకు కోనేం, ట్యూనా చేపలు చిక్కాయి. దీంతో ఆనందంలో తమ బోట్లును తీరం చేర్చారు. అనంతరం బోటులో ఉంచిన చేపలను కావడితో తీసుకొచ్చి స్థానిక వ్యాపారుల వద్ద ఉంచారు. అనంతరం ధర కోసం మత్స్యకారులకు, వ్యాపారులకు మధ్య ఒప్పందం కుదరడంతో నాలుగు కిలోల లోపు ఉన్న కోనేం(కొమరం మీనం) చేపలు కిలో రూ.550లు ధర పలకగా, ఆపైబడి బరువు ఉన్న కోనేం చేపలకు రూ.650 వరకు ధర పలికింది. దీంతో దాదాపు 1000 కిలోల కోనేం చేపలు, మరో 200 కిలోల ట్యూనా చేపలను దాదాపు రూ.6.50 లక్షలకు విక్రయించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో వీటి ధర రూ.800 వరకు పలుకుతుండగా, ట్యూనా చేపలు రూ. 250 వరకు ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. దీంతో ట్యూనా చేపలను కేరళ తరలించేందుకు, కోనేం చేపలను విశాఖపట్నం తరలించేందుకు స్థానిక వ్యాపారులు సిద్ధం చేశారు.





**కొబ్బరి, పనస మరియు మామిడి కోసే హక్కులు**

1. [illegible]
2. [illegible] 'QMG' Branch, Headquarters Army Air Defence College [illegible] 19 ఫిబ్రవరి 2024 నుండి 28 ఫిబ్రవరి 2024 వరకు [illegible] 13.00 గం॥ల మధ్యన రూ. 500/- (ఐదు వందల రూపాయలు మాత్రమే) [illegible]
3. [illegible]
4. [illegible] "BID FOR PLUCKING RIGHTS OF COCONUT, KATHAL & MANGO" అని వ్రాసి, 'QMG' Branch, HQ, Army Air Difence College Pin 928992, C/o 99 APO కు [illegible]
5. [illegible] 'QMG' Branch, HQ, Army AD College లో [illegible] 11 మార్చి 2024 నుండి 18 మార్చి 2024 వరకు 09.00 గం॥ల నుండి 13.00 గం॥ల మధ్యన [illegible] 'QMG' Branch, HQ, Army AD College కి 18 మార్చి 2024 13.00 గం॥ [illegible]
6. [illegible] 'QMG' Branch, HQ, Army AD College లో [illegible]
7. [illegible] 19 మార్చి 2024న 10.00 గం॥ [illegible]

Colonel Q,
Army Air Defence College, C/o 99 APO

## క్లుప్తంగా

### గిరిజనులతో ట్రైనీ కలెక్టర్ మమేకం


గిరిజనులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్

గంట్యాడ: ఐఏఎస్ శిక్షణలో భాగంగా జిల్లాలో శిక్షణ పొందుతున్న బీఎస్ వెంకట త్రివినాగ్ గురువారం తాటిపూడి జలాశయం వద్ద గల డీకే పర్తి, ఏకే పర్తి గ్రామాల గిరిజనులను కలుసుకున్నారు. వారితో మమేకమై ముఖాముఖి చర్చ నిర్వ హించారు. ఈ సందర్భంగా వారి జీవన విధానం, జీవనోపాధి గురించి వివరాలడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాటిపూడి కాటేజీ మేనేజర్ శేషు తదితరులు పాల్గొన్నారు.

### పదోన్నతి ఉత్తర్వుల అందజేత


రవికుమార్‌కు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ పరిధిలో జూనియర్ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రవికుమార్‌ను సీనియర్ సహాయకుడిగా నియమిస్తూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు అందజేశారు. జెడ్పీ చైర్మన్ కార్యాలయంలో గురువారం అందజేసిన ఈ ఉత్తర్వుల్లో ఎస్.రవికుమార్‌ను పార్వతీపురం మన్యం జిల్లా, కొమరాడ ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా నియమించినట్లు జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### రైలు ఢీకొని వ్యక్తి మృతి


విజయ్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: స్థానిక కుప్పిలి వీధికి చెందిన ఎస్.విజయ్ (33) రైలు ఢీకొని గురువారం మృతిచెందాడు. ఈ ప్రమాదంపై శ్రీకాకుళం జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలాజీ మార్కెట్‌లోని బట్టల షాపులో సేల్స్‌మన్‌గా విజయ్ పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్తున్న క్రమంలో గూడ్స్‌షెడ్ వద్ద రైల్వేట్రాక్ దాటుతుండగా వేగంగా వస్తున్న రైలు బలంగా ఢీకొంది. దీంతో విజయ్ మొండెం, తల వేరయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనాస్థలానికి వచ్చి చూసి కన్నీటిపర్యంతమయ్యారు. మృతునికి భార్య ప్రేమ, ఐదేళ్ల పాప ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం జీఆర్పీ హెచ్‌సీ మధుసూదనరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 45లీటర్ల సారా పట్టివేత

సాలూరు: పట్టణంలోని రెల్లివీధిలో వేర్వేరు సందర్భాల్లో ఇద్దరు మహిళల దగ్గర 45 లీటర్ల సారా పట్టుకున్నట్లు సీఐ జీడీ బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందిత మహిళలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

### వ్యక్తి అరెస్టు

పాలకొండ రూరల్: స్థానిక పోస్టాఫీసు రోడ్డులో 13 మద్యం క్వార్టర్ బాటిల్స్ అక్రమంగా తరలిస్తున్న దుప్పాడ రమేష్‌ను పాలకొండ ఎస్సై ఎన్.హేమంత్ కుమార్ గురువారం అరెస్టు చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నిందితుడిది విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని చిన్నపుర్లి గ్రామమని తెలిపారు. మద్యం అక్రమ రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ తరహా ఘటనలపై ప్రజలు సమాచారం అందించాలని కోరారు.

### ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా రేపు

విజయనగరం అర్బన్: వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 3న పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఇంటెల్ సర్వ్ ఐటీ సొల్యూషన్స్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ జరుగుతుందని పేర్కొన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్-6, ఫైనాన్షియల్ కన్సల్టెంట్-50, ఇంటెల్ సర్వ్‌లో ఫీల్డ్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ వర్క్-25 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఆయా పోస్టులను బట్టి ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. విజయనగరం, తగరపువలస, ఎస్.కోట ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా 'ఎన్‌సీఎస్.జీవోవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు స్థానిక బీసీ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 8919378915 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# ఉన్న ఊళ్లోనే ఉపాధి

- గణనీయంగా తగ్గిన వలసలు
- వేతనదారులకు ఉపాధి కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- గ్రామాల్లో ప్రారంభమైన పనులు
- 2023-24 లో 1.82 కోట్ల పనిదినాల లక్ష్యం
- ఇప్పటివరకు కల్పించినవి 1.63 కోట్లు
- వెచ్చించిన నిధులు రూ.531.83 కోట్లు


గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో పనిచేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపాధి కల్పిస్తోంది. ఈ పథకం సమర్థవంతంగా అమలు చేయడం వల్ల జిల్లానుంచి వలసలు గణనీయంగా తగ్గాయి. మూడు, నాలుగు నెలల పాటు ఈ పథకం ద్వారా ఉన్న ఊరిలోనే పని దొరుకుతోంది. దీంతో ప్రతిరోజూ జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది వేతనదారులు పనికి వెళ్తున్నారు. ఈ పథకం రాకముందు జిల్లానుంచి అనేకమంది పని కోసం చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వలస వెళ్లేవారు. కొంతమంది 3,4 నెలలు పాటు పనిచేసి స్వగ్రామాలకు తిరిగే వచ్చేవారు. మరి కొంతమంది అక్కడే స్థిర నివాసం ఉండేవారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆయా ప్రాంతాలకు వలసలు తగ్గిపోయాయి. ఉపాధి హామీ పథకం పనికి వెళ్లడం ద్వారా వచ్చిన వేతనాలతో సొంత గ్రామంలోనే సాఫీగా జీవనం సాగిస్తున్నారు.

**జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు**

జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు ఉన్నాయి. వాటి పరిధిలో 6,11,286 మంది వేతనదారులు ఉన్నారు. వారంతా ప్రభుత్వం కల్పిస్తున్న పనులకు వెళ్తున్నారు. వేతనదారులకు పనుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. వారికి పనులు కల్పించి వలసలను నివారించింది.

**2023-24లో 1.82 కోట్ల పనిదినాల లక్ష్యం**

2023-24వ సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా వేతన దారులకు 1.82 కోట్ల పనిదినాలు కల్పించాలన్నది లక్ష్యం. ఇప్పటివరకు 1.63 కోట్ల పనిదినాలు కల్పించారు. ఇందుకోసం రూ. 531.83 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది.

**ప్రారంభమైన పనులు**

ఖరీఫ్ సీజన్ ముగియడంతో రైతులు, కూలీలు పనులకు వస్తున్నారు. దీంతో డ్వామా అధికారులు గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించారు. ప్రతి వేతనదారుకు ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. గరిష్ఠ వేతనం రూ.272 కాగా రూ. 240 నుంచి రూ. 272 వరకు వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంది. వేతనం సకాలంలో జమ కావడంతో వేతనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతి ఏడాది పనుల కల్పన**



ప్రతి ఏడాది మాకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. ఎటువంటి పనులు లేని సమయంలో పనులు కల్పించడం వల్ల మాకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. పని డబ్బులు కూడా వారం, 10 రోజుల్లో మా ఖాతాల్లో పడుతున్నాయి. ఈ పనులు లేనిప్పుడు పనుల కోసం వెతుకులాడాల్సి వచ్చేది.

పి.సన్యాసమ్మ, వేతనదారు, పెదవేమలి గ్రామం

**ప్రతి వేతనదారుకు పని**



జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నాం. సొంత గ్రామంలో పనికల్పించడం వల్ల అధిక సంఖ్యలో వేతనదారులు పనికి వస్తున్నారు. వేతనం కూడా పనిచేసిన దానికిగిట్టుబాటయ్యే విధంగా చూస్తున్నాం. అన్ని వర్గాల వారు ఉపాధిహామీ పనికి వస్తున్నారు.

జి.ఉమాపరమేశ్వరి, పీడీ, డ్వామా

## అసిస్టెంట్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తిరుమలరావు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా సీహెచ్. తిరుమల రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు నుంచి బదిలీపై వచ్చిన ఆయన విధులకు హాజరయ్యే ముందు ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యాలయానికి చేరుకుని బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయయాదవ్‌లను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాభివృద్ధిలో తనవంతు కృషి చేస్తానని చెప్పారు. వివిధ ప్రాంతాలలో చేసిన అనుభవం మేరకు అవసరమైన విధంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తానన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ విజయలక్ష్మి, కౌన్సిల్ సభ్యుల సూచనలు, సలహాలతో నగరాభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికి, అభినందనలు తెలిపారు.

## విద్యార్థి చదువుకు ఏఎస్సై ప్రోత్సాహం


విద్యార్థి చదువు ఖర్చును కాలేజీ యాజమాన్యానికి అందజేస్తున్న ఏఎస్సై గోపీనాథరావు

బొండపల్లి: ఖాకీ మాటున కారుణ్యం కూడా ఉంటుందని నిరూపించిన ఏఎస్సై సేవానిరతిని పలువురు ప్రశంసిస్తున్నారు. ఓ విద్యార్థి చదువుకు అండగా నిలిచేందుకు ముందుకువచ్చిన బొండపల్లి ఏఎస్సై లెంక గోపీనాథ రావు పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన గెద్ద మణికంఠ బొండపల్లి మండలంలోని గొట్లాం గాయత్రి కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరాడు. ఇటీవల తండ్రి మరణించగా తల్లి నారాయణమ్మకు కొడుకును చదివించాలన్న ఆకాంక్ష ఉన్నప్పటికీ పేదరికం అడ్డుగా నిలుస్తోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఏఎస్సై గోపీనాథరావు తన మానవత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థి చదువుకయ్యే కాలేజీ ఫీజుతో పాటు, హాస్టల్ ఫీజును రూ.65 వేలు గురువారం కాలేజీ యాజమాన్యానికి చెల్లించారు. ఎంతవరకు చదివినా అందుకయ్యే పూర్తి ఖర్చును తాను భరిస్తానని బాగా చదివి స్థిరపడాలని విద్యార్థి మణికంఠకు సూచించారు.

## రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


సుమేధ్‌ను అభినందిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

నెల్లిమర్ల రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. ఆదర్శ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కేవీఎస్ సుమేధ్ గత నెల 28, 29 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈఓ లింగేశ్వరరెడ్డి సుమేధ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: బాలలకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఈ మేరకు స్థానిక కస్పా హైస్కూల్‌లో బాలల తల్లిదండ్రులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. బాలల భద్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల చదువుతో పాటు వారి అలవాట్లు, ప్రవర్తన విషయంలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీక్షేత్రంలో సుదర్శన హోమం


దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో ఉన్న శ్రీక్షేత్రంలో కొలువైన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం సుదర్శన హోమం నిర్వహించారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఆలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## వట్టిగెడ్డ రెయిలింగ్‌ను ఢీ కొట్టిన భారీ వాహనం


రెయిలింగ్‌ను ఢీ కొట్టిన భారీ వాహనం

వీరఘట్టం: దట్టమైన పొగమంచుతో రోడ్డు పూర్తిగా కనిపించకపోవడంతో గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో ఓ భారీ వాహనం వీరఘట్టంలోని వట్టిగెడ్డ వంతెన రెయిలింగ్‌ను ఢీ కొట్టింది. అయితే ఎటువంటి ప్రమాదం జరగపోయినప్పటికీ వంతెనకు అడ్డంగా భారీ వాహనం నిలబడిపోవడందో వంతెనకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. వెంటనే ఎస్సై ఎం.గోవింద సిబ్బందితో వచ్చి భారీ వాహనాన్ని తీయించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. గురువారం ఉదయం 9 గంటల వరకు మంచు కురుస్తుండడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు.

# మిమ్స్ ఉద్యోగుల ఆందోళన


నిరవధిక దీక్షలో పాల్గొన్న మిమ్స్ ఉద్యోగులు

నెల్లిమర్ల: మిమ్స్ యాజమాన్యం సస్పెన్షన్ విధించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మిమ్స్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్‌ఓబీవద్ద మిమ్స్‌ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం నిరవధిక దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరితే మిమ్స్ యాజమాన్యం సస్పెన్షన్ విధించడం దుర్మార్గమన్నారు. ముఖ్యంగా సస్పెన్షన్ విధించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకుని, బకాయి ఉన్న ఏడు డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే కక్ష సాధింపు, వేధింపులు ఆపాలని కోరారు. బదిలీ చేసిన ఉద్యోగులను మిమ్స్‌లోనే డ్యూటీలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసి వేతన ఒప్పందం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యేవరకూ నిరవధిక దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎం.నారాయణరావు, వి.అప్పలనాయుడు, కె.కామునాయుడు, టి.రామకృష్ణ, ఎం.నాగభూషణం, కె. నాగేశ్వరరావు, జి.వరలక్ష్మి, వి.భవాని, బి.బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పూర్తయిన పారాది కాజ్‌వే

- సోమవారం ట్రయల్ రన్


పూర్తయిన కాజ్‌వే నిర్మాణం

బొబ్బిలి: అంతర్రాష్ట్ర రహదారిలో బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై ఉన్న పాత వంతెన మరమ్మతుల బారిన పడడంతో రూ.10.90 కోట్లతో కొత్త వంతెన, కాజ్‌వే, అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు అధికార యంత్రాంగం త్వరగా నిర్మాణం చేపట్టి కాజ్‌వేను పూర్తి చేసింది. రూ.94లక్షలతో చేపట్టిన కాజ్‌వే, అప్రోచ్ రోడ్డు తుది దశ పనులు జరుగుతున్నాయి. రామభద్రపురం వైపు ఉన్న అప్రోచ్ రహదారి పూర్తి కాగా బొబ్బిలి వైపు వెళ్లే పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఆర్ అండ్‌బీ ఏఈ బీఏకే రాజు, కాంట్రాక్ట్ ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ట్రయల్ రన్ వేస్తామని, రహదారి, ఇతర పనులు ఏమైనా అదనంగా చేపట్టాల్సి ఉంటే చేస్తామని ఏఈ తెలిపారు. కాజ్‌వే నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పనులు త్వరగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

# పకడ్బందీగా ప్రాక్టికల్స్

- ఆర్‌ఐఓ ఎం.ఆదినారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐఓ ఆదినారాయణ

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఐఓ ఎం.ఆదినారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన రాజాంలోని వేద గాయత్రి కళాశాలలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం, బొబ్బిలి, చీపురుపల్లి, బాడంగి మండలాలకు చెందిన ఒకేషనల్, సైన్స్ అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 20 వరకు ఒకేషనల్‌కు సంబంధించి, 11 నుంచి 20 వరకు జనరల్‌కు సంబంధించి ప్రాక్టికల్స్ ఉంటాయన్నారు. విజయనగరం జిల్లాలోని 143 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరగనున్నాయని పేర్కొన్నారు. ఇందులో జనరల్‌కు సంబంధించి 98, ఒకేషనల్‌కు సంబంధించి 45 కేంద్రాలు కేటాయించామని తెలిపారు. 23,831 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సంబంధిత కళాశాల యజమానులకు సూచించామని చెప్పారు. అలాగే అధ్యాపకులంతా ఎటువంటి ప్రలోభాలకు తావివ్వకుండా ఏ రోజు మార్కులు ఆరోజే ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. గతంలో ఓఎంఆర్‌లు ఉండేవని, ఈ ఏడాది నుంచి కొత్తగా ఆన్‌లైన్ విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. అన్ని కేంద్రాలపై పర్యవేక్షణ ఉంటుందని, అవకతవకలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డెక్ మెంబర్లు ఎం.సత్యనారాయణ, కె.అప్పారావు, ఎస్.రామకృష్ణ, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**నేడు ఇంటర్మీడియట్ పర్యావరణ విద్య పరీక్ష**

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ పర్యావరణ విద్యకు సంబంధించి నిర్వహించాల్సిన రెండు పరీక్షల్లో ఒక పరీక్ష శుక్రవారం ఆయా కళాశాలల్లో ప్రారంభమవుతుందని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు. 'నీతి, నైతిక విలువలు' సబ్జెక్ట్‌పై పరీక్ష శుక్రవారం ఉంటుందని తెలిపారు. 3వ తేదీన జరగాల్సిన 'పర్యావరణ విద్య' సబ్జెక్ట్‌పై పరీక్ష ఈ నెల 23వ తేదీకి వాయిదా పడిందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 20,630 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారన్నారు.

# హోరా హోరీగా..


కబడ్డీలో మహిళల విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

- రెండో రోజు కొనసాగిన ఆడుదాం-ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు
- బ్యాడ్మింటన్ స్త్రీ, పురుషుల విభాగాల్లో విజేతలుగా నిలిచిన ఎస్.కోట, గజపతినగరం జట్లు


బ్యాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచిన ఎస్.కోట నియోజకవర్గ క్రీడాకారిణిలు

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా స్థాయి పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం, విజ్జి క్రీడా మైదానం వేదికలుగా కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ క్రీడాంశాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో జిల్లాలోని 7 నియోజకవర్గాలకు చెందిన క్రీడాకారులు పోటాపోటీగా తలపడుతున్నారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన బ్యాడ్మింటన్ పోటీల్లో పురుషుల విభాగంలో గజపతినగరం, విజయనగరం, బొబ్బిలి జట్లు మొదటి మూడు స్థానాలు దక్కించుకగా... మహిళల విభాగంలో ఎస్.కోట, మెంటాడ, గజపతినగరం నియోజకవర్గాలకు చెందిన జట్లు విజేతలుగా నిలిచాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీలు ఉత్కంఠగా సాగాయి. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. పోటీలను సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుత్ కుమార్‌తో పాటు పలువురు వ్యాయామ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు.

### ఎంపీడీవోలకు పోస్టుల కేటాయింపు

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల ఉమ్మడి జిల్లా పరిధిలోని 20 మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వారి స్థానంలో బదిలీపై వచ్చిన ఎంపీడీవోలకు జిల్లాలో పోస్టింగులు కేటాయిస్తూ జెడ్పీ సీఈవో గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలోని మెరకముడిదాం, దత్తిరాజేరు, తెర్లాం, సాలూరు, బలిజిపేట, రామభద్రపురం, గరుగుబిల్లి, గుర్ల, గుమ్మలక్ష్మీపురం, జామి, బొండపల్లి, గరివిడి, కొత్తవలస, వేపాడ, చీపురుపల్లి, మెంటాడ మండలాలకు శ్రీకాకుళం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఎంపీడీవోలకు పోస్టింగులు కేటాయించారు. అలాగే డెంకాడ, ఎస్.కోట, భోగాపురం మండలాలకు విశాఖ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఎంపీడీవోలకు పోస్టులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### ఎం.సింగుపురం విద్యార్థి ప్రతిభ

పాలకొండ రూరల్: విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పార్వతీపురం మన్యం జిల్లా తరఫున పాల్గొన్న పాలకొండ మండలం ఎం.సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. ఎనిమిదో తరగతి విద్యార్థి కీర్తి చరణ్‌తేజా సైన్స్ టీచర్ హైమావతి సహకారంతో రూపొందించిన ఎత్తైన భవనాలపైకి మెట్లమీదుగా గ్యాస్ సిలిండర్‌ను సులభంగా తీసుకెళ్లే ట్రాలీ ప్రాజెక్టుకు జాతీయస్థాయిలో మూడవ స్థానం లభించింది. ఈ సందర్భంగా విద్యార్థి, టీచర్‌ను హెచ్‌ఎం బి.సంఘంనాయుడుతో పాటు ఈడీఓ ప్రేమ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు, డీవైఈఓ పి.కృష్ణమూర్తి అభినందించారు.

## సర్వేడ్రోన్ మిస్సింగ్

వంగర: మండల పరిధిలోని పటువర్ధనం గ్రామంలో భూముల రీసర్వే చేస్తున్న సమయంలో డ్రోన్‌కెమెరా బుధవారం సాయంత్రం మిస్సైంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనవరి 31వ తేదీన సర్వేయర్లు వాసు, వర్మలు సర్వే చేస్తున్న సమయంలో ల్యాప్‌టాప్ నుంచి సిగ్నల్ కట్ అవడంతో పొలాల్లోకి పంపించిన డ్రోన్‌కెమెరా మిస్సైంది. దీంతో గురువారం చీపురుపల్లి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ మన్మథరావు పటువర్ధనం గ్రామంలో పర్యటించారు.

డ్రోన్‌కెమెరా వివరాల ఆచూకీ కోసం సిబ్బందితో కలిసి గాలించారు. ఈ డ్రోన్ కెమెరా విలువ రూ.25 లక్షలుంటుందని అధికారులు చెబుతున్నారు. డ్రోన్ కెమెరా మిస్సింగ్ విషయాన్ని తహసీల్దార్ డి.ఐజాక్ వద్ద ప్రస్తావించగా వాస్తవమేనని తెలిపారు. కార్యక్రమంలో బాగెంపేట సర్వేయర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.